సాక్షి
కుమురం భీం

గురువారం : 29 : జూన్ : 2023



త్యాగానికి ప్రతీక బక్రీద్ 8లో▸

హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా బక్రీద్‌ను నిర్వహిస్తారు. గురువారం ప్రత్యేక నమాజ్ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదులు ముస్తాబు చేశారు.



వెలవెలబోతున్న వసతి గృహాలు

వసతి గృహాలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. హాస్టళ్ల వార్డెన్లు తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1/26.5

ఆకాశం పూర్తిగా మబ్బులు పట్టి ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మన ఊరు– మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులు గడువులోగా పూర్తి చేయాలని విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ జంబోజు సత్తయ్య అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్‌వాడ, ఎవజీ పాఠశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. 25 రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రవేశాల సంఖ్య పెంచడం, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచనలు చేశారు.

బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి



పార్టీ విస్తారకలతో కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. భోపాల్‌లో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేరా బూత్ సబ్ సే మజ్బూత్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక రైలులో కాగజ్‌నగర్ చేరుకున్న జిల్లాకు చెందిన 13 మంది విస్తారక్‌లకు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ 13 మంది మండలాల్లో వారం రోజులపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023– 24 సంవత్సరానికి డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్‌లో బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. జూలై 31 వరకు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్‌లకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 98663 98678 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ధర్నా



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బుధవారం కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పట్టణ పేదలకు పంపిణీ చేయాలన్నారు. అలాగే ఇంటిస్థలం ఉన్న వారికి ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అనిత, నాయకులు ఇన్నోస్, ఎస్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

నీరున్నా నిష్ఫలం..!



వట్టివాగు ప్రాజెక్టు కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

- అసంపూర్తిగా ప్రాజెక్టులు
- ముందుకు కదలని కాలువల పనులు
- జిల్లాలో ఏళ్లుగా సాగునీటి కష్టాలు
- నీటి వనరులున్నా ఉపయోగపడని వైనం
- ముఖ్యమంత్రిపైనే జిల్లా ప్రజల ఆశలు

సాక్షి, ఆసిఫాబాద్: తలాపునే నీరు ఉన్నా చేప దూపకు ఏడ్చిందన్నట్టుగా సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లున్నా చుక్క నీటిని వాడుకోలేని దుస్థితి జిల్లా రైతులకు దాపురించింది. ప్రాజెక్టులు నిర్మిస్తే తమ భూములు పంట పొలాలుగా మారుతాయని ఆశించిన రైతాంగానికి నిరాశే ఎదురవుతోంది. ఫలితంగా అన్నదాతలకు ఏటా వర్షాధారమే దిక్కవుతోంది. దశాబ్దాలుగా ప్రధాన ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉండడంతో సరైన సాగునీటి వసతిలేక వేలాది ఎకరాల భూమి నిరుపయోగంగా మారుతోంది. రైతులకు గత్యంతరం లేక ఆరుతడి పంటలపైనే ఆధారపడాల్సి వస్తోంది. చివరికి వానొస్తేనే పంట.. లేకుంటే లేదు అన్న చందంగా మారింది. ప్రాజెక్టు పూర్తయినా సక్రమంగా నీరందిస్తే తప్ప సాగు పండుగలా మారే పరిస్థితి కనిపించడం లేదు. ప్రధానంగా కుమురంభీం ప్రాజెక్టు, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తికాలేదు. అలాగే వట్టివాగు, చెలిమెల వాగు ప్రాజెక్టు కాలువలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు సరిపడా నిధులు మంజూరు చేయకపోవడం.. ప్రాజెక్టుల్లో నీరున్నా నిష్ఫలంగా మారుతోంది. ఈ నెల 30న జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి.. సాగునీటి ప్రాజెక్టులను వినియోగంలోకి తెచ్చేందుకు నిధుల మంజూరు ప్రకటన చేస్తారని స్థానిక రైతులు ఆశిస్తున్నారు.

'వట్టివాగు' ఆయకట్టు కింద పత్తిచేన్లు

ఆసిఫాబాద్ మండలంలోని 24,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో చిర్రకుంట సమీపంలో రూ.120 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన వట్టివాగు ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. కుడికాలువ ద్వారా 21,800 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 2,700 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్దేశించారు. కాలువలు మొత్తం దెబ్బతిన్నాయి. ఆది నుంచి అవి ఆధునీకీకరణకు నోచుకోకపోవడంతో లైనింగ్ కోల్పోయి చెట్లు ఏపుగా పెరిగి అధ్వానంగా మారాయి. చాలాచోట్ల కాలువలు నామరూపాలు లేకుండా పోయాయి. ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల పరిధిలోని పూర్తిస్థాయి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే స్థితిలో లేదు. దీంతో రైతులు వరి పొలాలను తీసేసి పత్తి పంట సాగు చేస్తున్నారు.

జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు: గడువు ముగిసి 18 ఏళ్లు!

పదిహేను వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాల్సిన మధ్య తరహా ప్రాజెక్టు ఇది. నిర్మాణం పూర్తి చేయాల్సి గడువు ముగిసి 18 ఏళ్లు దాటిపోయాయి. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. ఒక్క ఎకరాకూ నీరందలేదు. ఇప్పటికీ హెడ్‌వర్క్స్ పూర్తి కాలేదు. ప్రధాన కాలువ తవ్వకం పని ఇంకా పెండింగ్‌లో ఉంది. డిస్ట్రిబ్యూటరీ కాలువలపై నిర్మించాల్సిన 482 స్ట్రక్చర్లలో ఒక్కటి కూడా ప్రారంభం లేదు. హెడ్‌వర్క్స్‌కు ఇంకా ఏడు ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఏటా బడ్జెట్‌లో అరకొర నిధులే కేటాయించడంతో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయి.

అసంపూర్తిగానే 'కుమురంభీం'



దాదాపు రూ.600 కోట్లకు పైగా అంచనాలతో నిర్మితమైన కుమురంభీం ప్రాజెక్టు ఏళ్లుగా రైతులకు నీరందించడం లేదు. పది టీఎంసీల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు నిర్మించారు. సాగు లక్ష్యంలో సగం మేర కూడా రైతులకు నీరందడం లేదు. కుడి కాలువ ద్వారా ఆసిఫాబాద్ మండల పరిధిలోని 6వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా ఆసిఫాబాద్‌తోపాటు కాగజ్‌నగర్, సిర్పూర్(టి)మండలాల్లోని 45,500 ఎకరాలకు సాగు నీటిని అందించేలా రూపకల్పన చేశారు. ప్రాజెక్టు ప్రధాన నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా కాలువల పనులు పూర్తి కాలేదు. మైనర్, సబ్ మైనర్, డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం ఇంకా చేపట్టాల్సి ఉంది. అలాగే కుడి కాలువ లైనింగ్ పనులు చేపట్టపోవడంతో ఇప్పటికే ఆనవాళ్లు కోల్పోయింది. దీనికితోడు రిజర్వాయర్ కట్ట కూడా కుంగిపోతుండడం ప్రాజెక్టు దుస్థితికి అద్దం పడుతోంది.

రైళ్ల రద్దుతో ప్రయాణ కష్టాలు



సిర్పూర్(టి) రైల్వే స్టేషన్

- కాజీపేట– బల్లార్షా మార్గంలో నిత్యం మరమ్మతులు
- తరచూ ప్యాసింజర్ రైళ్లు రద్దు
- రాకపోకలు సాగించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

సిర్పూర్(టి): మెయిన్, మూడో లైన్ మరమ్మతుల పేరిట కాజీపేట, బల్లార్షా మార్గంలో పలు రైళ్లను తరచూ రద్దు చేస్తున్నారు. తాజాగా జూన్ 17 నుంచి జూలై 3 వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారుల ప్రకటించారు. ప్యాసింజర్ రైళ్ల ద్వారా మహారాష్ట్రతోపాటు మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్, కాజీపేట, వరంగల్ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతుల కారణంగా రద్దు..

కాజీపేట– సిర్పూర్(టి)– బల్లార్షా మార్గంలో రైల్వే మెయిన్ లైన్‌లో మరమ్మతుల కారణంగా అధికారులు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. మళ్లీ జూలై 3 తర్వాత పునరుద్ధరిస్తామని ప్రకటించారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి కరీంనగర్ మధ్య నడిచే పుష్పుల్ ప్యాసింజర్, కాజీపేట, సిర్పూర్(టి) మధ్య నడిచే సింగరేణి రైలు, కాజీపేట, బల్లార్షా మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్ రైళ్ల ప్రస్తుతం నడవడం లేదు.

రైళ్లే ఆధారం..

ముఖ్యంగా సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు ప్రయాణాలకు రైలు మార్గంపైనే ఎక్కువగా ఆధారపడతారు. హైదరాబాద్ వంటి పట్టణాలతోపాటు మహారాష్ట్రలోని రాజురా, బల్లార్షా పట్టణాలు, గ్రామాలకు వెళ్లేందుకు వారికి ప్యాసింజర్ రైళ్లే ఆధారం. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం బస్సు సౌకర్యం కూడా నిలిపివేయడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడో లైన్, మెయిన్ లైన్ మరమ్మతుల పేరిట అధికారులు నిత్యం రైళ్ల రద్దు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

ఆర్థికంగా ఇబ్బంది



దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రైళ్లలోనే వెళ్తుంటాం. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం అంటే ఆర్థికంగా ఇబ్బందవుతోంది. ప్యాసింజర్ రైళ్లు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాగజ్‌నగర్‌కు వెళ్లి రైలు ఎక్కుతున్నాం. – వినేశ్, సిర్పూర్(టి)

జాప్యం చేయొద్దు



కాజీపేట, బల్లార్షా మార్గంలో నిత్యం రైళ్లు రద్దు చేస్తున్నారు. జాప్యం లేకుండా రైల్వే లైన్ మరమ్మతులు పూర్తి చేయాలి. రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలి. అధికారులు దీనిపై దృష్టి సారించాలి. – వినోద్, చింతకుంట

సీఎంను కలిసే అవకాశం ఇవ్వాలి

- కలెక్టర్‌కు ఎస్పీఎం నెగోషియేషన్ కమిటీ సభ్యుల వినతి



వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్/కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ పేపర్ మిల్లు సమస్యలపై సీఎం కేసీఆర్‌ను కలిసే అవకాశం కల్పించాలని ఎస్పీఎం నెగోషియేషన్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2018 ఆగస్టు 12న ఎస్పీఎం మిల్లు పునరుద్ధరణ జరిగినా.. మిల్లులో పనిచేసిన దాదాపు 200 మంది పర్మినెంట్ కార్మికులను యాజమాన్యం తిరిగి విధుల్లోకి తీసుకోవడం లేదనిపేర్కొన్నారు. కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే మిల్లు పునరుద్ధరణకు ప్రభుత్వ రాయితీలు కల్పించిందని తెలిపారు. కానీ యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న స్థానిక కార్మికులకు తక్కువ వేతనాలు, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికి ఎక్కువ వేతనాలను చెల్లిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కల్లోల భట్టాచార్య, సూర్యప్రకాశ్, జాగ్ ప్రకాశ్, ఏకే సింగ్, షబ్బీర్ హుస్సేన్, సునీల్, రాంచందర్, వెంకటేశ్, పత్రాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు జోరు..!



ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఖాదర్ హుస్సేన్

- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- ఇప్పటికే 2.25 లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు
- జిల్లాలో ఇప్పటికీ లోటు వర్షపాతమే..

ఆసిఫాబాద్: వర్షాలు ఆలస్యం కావడంతో జిల్లాలో ఇప్పుడిప్పుడే సాగు జోరందుకుంటోంది. మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షం పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సాధారణంగా ఏటా జూన్ రెండో వారంలో వర్షాలు కురుస్తుండగా.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యమైంది. సకాలంలో వర్షాలు లేకపోవడంతో కొంతమంది జోరు ఎండల్లోనే పత్తి విత్తనాలు విత్తుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కొన్నిచోట్ల మొలకలు వస్తున్నాయి.

జోరుగా పత్తి సాగు..

వర్షాలతో సంబంధం లేకుండా జిల్లాలోని రైతులు జూన్ ప్రారంభం నుంచే పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,55,038 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా పత్తి 3.42 లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నారు. అయితే ఇప్పటికే 2.25 లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేసినట్లు అధికారులు గుర్తించారు. వరి 58వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేసినా.. భారీ వర్షాలు పడకపోవడంతో రైతులు నార్లు పోసుకోలేదు. ప్రాజెక్టులు, చెరువుల్లోకి సైతం సమృద్ధిగా వరద చేరకపోవడంతో వేచి చూసే ధోరణిలో ఉన్నారు.

ఇంకా లోటు వర్షపాతమే..

కొన్ని సంవత్సరాలుగా వానాకాలం సీజన్ జిల్లా రైతులకు కలిసి రావడం లేదు. అతివృష్టి లేదా అనావృష్టితో తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగ వరదలతో పెంచికల్‌పేట్, దహెగాం, కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది జూన్ దాటుతున్నా ఇప్పటికీ సమృద్ధిగా వర్షం పడలేదు. ఈ నెల 1 నుంచి 28 వరకు సాధారణ వర్షపాతం 170.2 మిల్లీ మీటర్లు కురవాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 106.8 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. జిల్లా సగటున మొత్తంగా అన్ని మండలాల్లోనూ ఇంకా లోటు వర్షపాతమే ఉంది. గతేడాది ఇదే సమయానికి 217 మిల్లీమీటర్లు వర్షం పడింది. సగటు కంటే 111.8 మి.మీ. అధికంగా వర్షపాతం నమోదైంది.

పెరగనున్న సాగు..

పంటలకు మద్దతు ధర పెరగడం, పోడు పట్టాల పంపిణీతో ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. పత్తి మద్దతు ధర రూ.8,558లకు చేరడంతో చాలా మంది పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే గిరి వికాస్ పథకం కింద త్రీఫేజ్ విద్యుత్, బోరు సౌకర్యం పొందిన వారు వరి, ఆరుతడి పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట్ రైతులు గతేడాది నుంచి మిర్చి సాగు వైపు మళ్లారు. వారికి మంచి లాభాలు రావడంతో మరింత మంది మిర్చి సాగు చేసే అవకాశం ఉంది.

జూలై 15 వరకు పత్తి విత్తుకోవచ్చు

ఈ ఏడాది వర్షాలు 15 రోజులకు పైగా ఆలస్యం కావడంతో సాగు కూడా నెమ్మదిగా సాగుతోంది. అయినా రైతులు జూలై 15 వరకు పత్తి విత్తనాలు విత్తుకోవచ్చు. విత్తనాలు వేసిన 24 గంటల లోగా పెండి మిథాలిన్ ప్రీ ఎమర్జెన్స్ హెర్బిసైడ్ పిచికారీ చేస్తే 25 రోజులపాటు గడ్డిని అరికట్టవచ్చు. విత్తనాలు వేసిన 15 రోజుల తర్వాత యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వేయాలి. మూడు దఫాలుగా ఎరువులు వేసుకుంటే ఉపయోగం ఉంటుంది. వ్యవసాయ అధికారుల సూచనలు లేకుండా అనవసరంగా పురుగుమందులు పిచికారీ చేయొద్దు.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

'సీఎం సభ' ఏర్పాట్లు వేగవంతం

- పనులు ప్రారంభించిన ఎమ్మెల్సీ దండె విఠల్
- సభాస్థలిని పరిశీలించిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ప్రజాప్రతినిధులు



భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న కరీంనగర్ రేంజ్ డీఐజీ రమేశ్‌నాయుడు, ఎస్పీ సురేశ్‌కుమార్



సభాస్థలి వద్ద చర్చిస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ప్రజాప్రతినిధులు, తదితరులు

ఆసిఫాబాద్: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్‌ఎస్ నేతలు భారీ జనసమీకరణ చేపట్టడంతోపాటు సభను విజయవంతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన నిర్వహించే బహిరంగ సభాస్థలంలో బుధవారం ఎమ్మెల్సీ దండె విఠల్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. సాయంత్రం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పనులను పరిశీలించారు. అలాగే ఉదయం నుంచి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే రహదారి వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం పనులకు అంతరాయం కలిగినా.. మధ్యాహ్నం తర్వాత వేగం పెంచారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు..

సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కరీంనగర్ రేంజ్ డీఐజీ రమేశ్‌నాయుడు బుధవారం ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం సభాస్థలి, పార్కింగ్, ట్రాఫిక్ వివరాలతోపాటు రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. సుమారు 2500 మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కరీంనగర్ ప్రిన్సిపల్ పోలీసు ట్రైనింగ్ సెంటర్ ఎస్పీ అరవింద్, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పోరాట ఫలితమే పోడు పట్టాలు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతుల సమస్యలపై బీజేపీ నిరంతరం చేసిన పోరాట ఫలితంగా నేడు ప్రభుత్వం పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతే రాజు అంటున్న ప్రభుత్వ హయాంలో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు ఎందుకు పూర్తికావడం లేదని ప్రశ్నించారు. పూర్తయిన వాటికి కాలువలు లేక సాగు నీరందడం లేదన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ఇక్కడి నుంచి తరలించి తీవ్ర అన్యాయం చేసి కేసీఆర్.. జిల్లా పర్యటనలో రైతులకు ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఎలాంటి షరతులు లేకుండా పోడు భూములు సాగు చేసుకుంటున్న ప్రతిఒక్కరికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు సూర్యప్రకాశ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యాధికారుల మెరిట్ జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్టు ప్రాతిపదిక పనిచేసేందుకు ఆయుష్ వైద్యాధికారుల నియామకానికి సంబంధించి మెరిట్ లిస్ట్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖ విడుదల చేసింది. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని నోటీస్ బోర్డుతోపాటు https:// asifabad. telangana. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఎంహెచ్‌వో రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై 1 వరకు వివరాలను చూసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై బాలుడి ఆత్మహత్య

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సత్యసాయి నగర్ కాలనీకి చెందిన బాలుడు మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం... శివసాయి(16) కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినకుండా మద్యం సేవించేవాడు. మంగళవారం సైతం అతిగా మద్యం తాగి రాగ కుటుంబ సభ్యులు మందలించడంతో రాత్రి ఇంటి ఆవరణంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి రామ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని ధనోరా అటవీ ప్రాంతంలో బుధవారం కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు జోడేఘాట్ ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. ధనోరా అడవి నుంచి జింక రోడ్డుపైకి రావడంతో గమనించిన గ్రామ కుక్కలు వెంబడించి దాడి చేశాయి. దీంతో జింక మృతి చెందింది. తర్వాత ధనోరాలోనే దహనం చేసినట్లు జ్ఞానేశ్వర్ తెలిపారు. ఎఫ్ఎస్‌వో మల్లయ్య, బీట్ అధికారి భూంరావు ఉన్నారు.

ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న పెన్షన్‌దారులు

నస్పూర్: తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల జేఏసీ ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు కే ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. బకాయి ఉన్న రెండు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పెన్షన్‌ని ప్రతీ నెల ఒకటవ తేదీన అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. జులై 12న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి చక్రధర్‌రావు, కార్యదర్శి కేఎంఎస్ రెడ్డి, సభ్యులు రవిశంకర్, జనార్దన్ చంద్రశేఖర్, రాయలింగు పాల్గొన్నారు.

మోసపోయిన యువకుడు

బెల్లంపల్లి: వాట్సాప్ గ్రూపు మెస్సెజ్‌కు స్పందించి బెల్లంపల్లికి చెందిన ఓ యువకుడు మోసపోయిన వైనం బుధవారం వెలుగు చూసింది. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి పోస్టాఫీసు బస్తీలో నివాసం ఉంటున్న రాకేష్ పాండే అనే యువకుడు ఇండియన్ పోస్టు పేమెంట్ వాట్సాప్ గ్రూపులో యాడ్ అయ్యాడు. ఇటీవల ఆ గ్రూపులో గుర్తు తెలియని వ్యక్తి యూఎల్‌సీ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు మెస్సెజ్‌ను పోస్టుచేశాడు. స్పందించిన రాకేష్ పాండే సదరు వ్యక్తికి ఫోన్‌చేసి తనకో యూఎల్‌సీ కేంద్రం కావాలని అభ్యర్థించాడు. ఇందుకు సదరు వ్యక్తి డబ్బులు చెల్లించాలని చెప్పడంతో రాకేష్ రూ.13,001 పే చేశాడు. మళ్లీ రూ.9వేలు చెల్లించాలని సదరు వ్యక్తి కోరడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా మోసపోయినట్లు గ్రహించాడు. బుధవారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు బక్రీద్ పర్వదినం
- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



ఆదిలాబాద్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

సెన్నెల/ఉట్నూర్‌రూరల్/కెరమెరి: హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లింలు నిర్వహించుకుంటారు. దీనినే ఈద్ ఉల్ జుహా అని కూడా అంటారు. ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 11వ రోజున పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇస్లాం మానవాళికి నిర్దేశించిన విధి విధానాల్లో ఐదో విధి మక్కా యాత్ర చేయడం, జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని పేదలకు పంచడం, రెండు రకాతులుగా నమాజ్‌లు ఆచరించడం ఈ పండుగ ప్రత్యేకత. గురువారం బక్రీద్ పండుగ నమాజ్ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదులు ముస్తాబు చేశారు. ఆదిలాబాద్‌లోని ఈద్గా వద్ద ఎమ్మెల్యే జోగు రామన్న, ఏర్పాట్లను పరిశీలించారు.

ఖుర్బానీ తప్పనిసరి

ఇబ్రహీం త్యాగనీరతిని మెచ్చి బక్రీద్ పండుగ రోజు జంతుబలి ఇవ్వాలని, ఈ విధానాన్ని ప్రళయం వరకు కొనసాగించాలని నిర్దేశించినట్లు ఇస్లాం చెబుతోంది. ఎవరి వద్దయితే యాభైరెండున్నర తులాల వెండి.. ఎడున్నర తులాల బంగారం లేదా ఆ మేరకు డబ్బు ఉంటుందో వారిపై ఖుర్బానీ తప్పనిసరి అవుతుంది. ఈ మేరకు ముస్లింలు బక్రీద్ రోజున పెద్ద ఎత్తున జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పేదలకు సమభాగాలుగా పంపిణీ చేస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గొర్రెలు, మేకల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

ప్రత్యేక ప్రార్థనలు

ముస్లింలు ఈద్ నమాజ్‌లు ఊరిబయట మైదానంలోని ఈద్గాల్లో చేయాలని నియమం. నమాజ్ ఆచరణకు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఈద్గాలకు వెళ్లలేని తరుణంలో సమీప మసీదుల్లో నమాజ్ చేయనున్నారు.

బక్రీద్ రోజున మక్కా యాత్ర

ఇస్లాం విధి విధానాల్లో ఐదో విధానమైన హజ్(మక్కాయాత్ర) ఇదే రోజున మక్కాలో జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ముస్లింలు మక్కా మసీదులోని కాబా దర్శనం చేసుకుంటారు. 40 రోజుల హజ్ యాత్రలో భాగంగా మక్కా మదీనాల్లో నమాజ్ ఆచరిస్తూ శైతాన్‌కు రాళ్లు వేసే ప్రక్రియలో పాల్గొంటూ దైవారాధనలో గడుపుతారు.

మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు



ముస్లింలు అల్లా ఆదేశాలను పాటిస్తూ పండుగ వేడుకలు జరుపుకుంటారు. వర్షాకాలం దృష్ట్యా వర్షాలు కురుస్తుండటంతో ఈద్గాల వద్ద సౌకర్యాలను బట్టి నమాజ్ చేయడం జరుగుతుంది. వర్షం వల్ల ఆటంకాలు వస్తే తమ తమ సమీప మసీదుల్లో నమాజ్ చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. పండుగను శాంతియుత వాతావరణంలో కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో జరుపుకోవాలి.

– కలీం, మౌలానా జామా మసీద్, ఉట్నూర్

గిరిజన ఆణిముత్యం

- నీట్‌లో ఆల్‌ఇండియా ఎస్టీ కోటాలో 2,782 ర్యాంక్
- కూలీ పనిచేస్తూ చదివించిన తల్లి
- తొమ్మిదో తరగతిలో తండ్రి మృతి..



తల్లి బుచ్చక్కతో స్రవంతి

దహెగాం: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది ఓ కూలీ కూతురు. చిన్నతనంలోనే తండ్రి మృతి చెందగా తల్లి కూలీ పనులు చేసుకుంటూ కూతుర్ని చదివించింది. తండ్రి క్యాన్సర్‌తో ఐదేళ్ల క్రితం మృతిచెందడంతో ఆ పసి మనసులో అప్పటి నుంచే డాక్టర్ కావాలని తలపించింది. మా నాన్నలాగా ఎవరు మృతిచెందవద్దనే ఉద్దేశంతో పట్టుదలతో చదివి ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో 427 మార్కులు సాధించగా ఎస్టీ కోటాలో 2,782 ర్యాంక్ కైవసం చేసుకుంది. కొలవార్ తెగలో వైద్య విద్యను పూర్తి చేస్తే తొలి విద్యార్థిని సంగర్ష్ స్రవంతి కానుంది.

కుటుంబ నేపథ్యం..

కుమురంభీం జిల్లా దహెగాం మండలం చంద్రపల్లి గ్రామానికి చెందిన సంగర్ష్ శంకర్, బుచ్చక్కలకు ఐదుగురు ఆడపిల్లలే. అందులో ఐదో సంతానమైన స్రవంతి 1 నుంచి 5వ తరగతి వరకు చంద్రపల్లి ప్రాథమిక పాఠశాలలో చదివింది. 6 నుంచి 10వ తరగతి వరకు దహెగాంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో చదివింది. పదిలో 8.2 జీపీఏ సాధించింది. 9వ తరగతి చదువుతున్న క్రమంలో తండ్రి శంకర్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. శంకర్‌కు సరైన వైద్యం అందక చనిపోయాడని ఇరుగుపొరుగు వారు అనేవారు. అప్పుడే ఆమెలో డాక్టర్ కావాలనే ఆలోచన మొదలైంది. దీంతో బంధువుల సహకారంతో డీఆర్‌డీఏను సంప్రదించి హైదరాబాద్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో సీటు సాధించింది. ఇంటర్ బైపీసీలో 934 మార్కులు సాధించింది.

కుంగిపోకుండా చదివి..

ఇంటర్ పూర్తి చేసిన స్రవంతి డాక్టర్ కావాలని కోరిక ఉండగా ప్రైవేటులో నీట్ శిక్షణ తీసుకునే ఆర్థిక స్థోమత లేక గిరిజన శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్‌రాల్డ్‌లో నీట్ శిక్షణ తీసుకుంది. మొదటి ప్రయత్నంలో నీట్‌లో సీటు కోల్పోయింది. అయినా కుంగిపోకుండా అధైర్యపడకుండా పట్టుదలతో చదివి రెండోసారి 427 మార్కులు సాధించి ఎస్టీ కోటాలో 2,782 ర్యాంకు సాధించి వైద్య విద్యకు ఎంపికైంది. వైద్య విద్య పూర్తి చేస్తే తెలుగు రాష్ట్రాల్లో కొలవార్ తెగలో మొదటి మహిళగా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

నా బిడ్డను డాక్టర్‌గా చూడాలనుకున్నా

నా భర్త ఐదు సంవత్సరాల క్రితం చనిపోయిండు. నాకు ఐదుగురు ఆడపిల్లలే. నలుగురు పిల్లల పెండ్లీలు చేసినా. స్రవంతి ఐదవ బిడ్డ ఆమె చిన్నప్పటి నుంచి మంచిగ చదువుకుంటుంది. స్రవంతిని డాక్టర్ చదివించాలని నా కోరిక నేను కూలీ పనులు చేసుకుంటు ఆమెను చదివిపిచ్చినా మేము కష్టపడినట్లు నా బిడ్డ కష్టపడవద్దని ఆమెను చదివిపించి డాక్టర్ చేయాలని అనుకున్న. స్రవంతి డాక్టర్ అయితందని అందరు అంటురు. నాకు ఆనందంగా ఉంది.

– బుచ్చక్క, స్రవంతి తల్లి, చంద్రపల్లి

పేదలకు వైద్యం అందిస్తా

సరైన వైద్యం అందక మా నాన్న చనిపోయినట్లు ఊర్లో అందరూ అనేవారు. అప్పటి నుంచే డాక్టర్ కావాలని అనుకున్న. కష్టపడి చదివితే సాధించవచ్చని అనుకుని నీట్ మొదటి సారి రాస్తే ర్యాంక్ రాలేదు. అయినా బాధపడకుండా రెండో సారి కోచింగ్ తీసుకుని ప్రయత్నం చేయగా ఎస్టీ కోటాలో 2,782 ర్యాంకు వచ్చింది. తల్లిదండ్రులు కష్టపడి నన్ను చదివించారు. నాన్న లేకపోయినా అమ్మ నాకు ధైర్యం చెప్పింది. నిరుపేదలకు వైద్యం అందిస్తా.

– స్రవంతి, చంద్రపల్లి

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

తిర్యాణి: ఈనెల 26న మండల కేంద్రంలోని సహకార బ్యాంక్‌లో చోరీకి యత్నించడంతో పాటు మండల కేంద్రానికి చెందిన సకారం అనే వ్యక్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవపూర్ గ్రామానికి చెందిన సామ రాకేశ్‌రెడ్డి, తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామానికి చెందిన గేడం శ్రీనివాస్ అనే ఇద్దరూ మిత్రులు ఈ నెల 26న మంచిర్యాలలో కలుసుకుని మద్యం సేవించారు. అనంతరం ఈజీగా మనీ సంపాదించాలనే ఉద్దేశంతో చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో మండల కేంద్రానికి చేరుకుని, రాత్రి 11:30 గంటల సమయంలో సహకార బ్యాంకు లూటి చేసేందుకు యత్నించగా డబ్బులు భద్రపర్చిన లాంకర్‌లు తెరుచుకోకపోవడంతో ఎదురుగా ఉన్న సకారం అనే వ్యక్తి కి చెందిన ఇంటికి తాళం వేసి ఉండడాని గమనించి ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారంతో పాటు రూ.12వేల నగదును దొంగిలించారు. బుధవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించగా కన్నెపెల్లి బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.



చోరీకి పాల్పడిన నిందితులతో పోలీసులు

కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను రద్దు చేయాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ సీతారామయ్య



మాట్లాడుతున్న వీ సీతారామయ్య

శ్రీరాంపూర్: ఎన్నికలు వద్దనుకుంటే కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను రద్దు చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ సీతారామయ్య తెలిపారు. బుధవారం ఆయన నస్పూర్- శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల నిర్వహించాలని ఏ మాత్రం లేదన్నారు. ఎన్నికలు నిర్వహించకుంటే యాజమాన్యానికి మేలు జరుగుతుందన్నారు. కార్మికులు మాత్రం సమస్యలు పరిష్కారం కాక ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. యజమాన్యం, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ రెండు కలిసి కోర్టుకి వెళ్లడం వల్లే ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. ఎన్నికల నిర్వహిస్తే ఓడిపోతామనే భయంతో రాష్ట్ర సర్కార్ కావాలని జాప్యం చేస్తుందని తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి రెండేళ్లయినా, నాలుగేళ్లయినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. బయట జరిగే కార్యక్రమాలకే కాకుండా మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ, ఏరియా కమిటీ, స్ట్రక్చరల్, జేసీసీ మీటింగ్‌లకు కూడా అన్ని సంఘాల నాయకులను పిలవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు గునిగంటి నరసింహారావు, అఫ్రోజ్ ఖాన్, సారయ్య పాల్గొన్నారు.

భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతి అందించాలి

- గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో 516 మొక్కలు నాటిన డైరెక్టర్ బలరాం



ఐకే-ఓసీపీపై మొక్కలు నాటుతున్న డైరెక్టర్ బలరాం, నాయకులు

జైపూర్: బాధ్యతతో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలని సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్) ఎస్.బలరాం తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఓపెన్‌కాస్టు గని ఆవరణలో బుధవారం గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా డైరెక్టర్ బలరాం ఒక్కడే 516 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐకే - ఓసీపీపై మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ అనేక మొక్కలను నాటుతూ వాటిని రక్షిస్తూ ముందుకు వెళ్తోందన్నారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలను నాటాలని సూచించారు. ఇప్పటి వరకు 15వేలా 789 మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న డైరెక్టర్ బలరాం అన్ని ఏరియాల్లో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడంపై చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐకే-ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గని మేనేజర్ బ్రహ్మాజీ, నాగన్న, ప్రాజెక్టు ఇంజినీర్ రమేశ్, టీబీజీకేఎస్ నాయకులు పెట్టం లక్ష్మణ్, కుమారస్వామి, జగదీశ్వర్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శులు గడ్డం మల్లన్న, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని భార్య మృతి

బెల్లంపల్లి: కట్టుకున్న భర్త కాపురానికి తీసుకెళ్లడం మనస్తాపానికి గురైన ఓ మహిళ అనారోగ్యం పాలై మృతిచెందింది. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య కథనం ప్రకారం.... బెల్లంపల్లి భూడిద గడ్డ బస్తీకి చెందిన ఆయిళ్ల విజయ, మల్లేష్ దంపతుల కుమార్తెను చైతన్యను 2017లో వైజాగ్‌కు చెందిన కవ్వంపల్లి నరేష్‌తో పెళ్లి చేశారు. పెళ్లైన రెండు నెలల తరువాత అదనపు కట్నం రూ.2లక్షలు తీసుకురావాలని భర్త, అత్తమామ లక్ష్మి, మల్లయ్యలు వేధించి ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. పుట్టింటికి వచ్చిన చైతన్య భర్త కాపురానికి తీసుకెళ్లకపోవడంతో తీవ్ర మానసిక వేదనతో అనారోగ్యం పాలై ఇటీవల మృతిచెందింది. బుధవారం మృతురాలి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సివిల్స్ ప్రిలిమినరీ శిక్షణకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ 10 నెలల రెసిడెన్షియల్ శిక్షణ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పి.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత పరీక్ష హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్‌లో జులై 9వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. 75సీట్లు షెడ్యూల్డ్ కులాల వారికి, 15 సీట్లు వెనుకబడిన తరగతుల వారికి, 10 సీట్లు షెడ్యూల్డ్ తెగల వారికి కేటాయించినట్లు వివరించారు. మొత్తంలో 33.33 శాతం మహిళలకు, 5శాతం దివ్యాంగులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హత గల పట్టభద్రులు రాష్ట్ర స్టడీ సర్కిల్‌లో ప్రవేశం పొందేందుకు ప్రవేశ పరీక్ష కోసం జులై 2వ తేదీలోగా ఆన్‌లైన్‌లో www.tsstudycircle.co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కేయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30న జరగాల్సిన డిగ్రీతో సహా ఇతర పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం తెలిపారు. జూలై 1న గ్రూప్-4 పరీక్ష ఉన్నందున ఈనెల 30న జరగాల్సిన పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే జరుగుతాయని ప్రకటించారు.

తండ్రి, అన్నావదినలపై కేసు..

- ఆడపడుచును చితకబాదిన పుట్టింటివారు..

బెల్లంపల్లి: ఆడపడుచును చితకబాదిన అన్నావదిన, తండ్రిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... బెల్లంపల్లి బూడిదగడ్డ బస్తీకి చెందిన గుండారపు శ్యామల, సతీష్‌కుమార్ భార్యభర్తలు. శ్యామల తన ఆడపడుచు గుండారపు శరణ్యకు గతేడాది నవంబర్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన గొట్టే నాగరాజు అనే యువకుడిని పెళ్లి చూపులకు తీసుకురాగా శరణ్య నిరాకరించింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు వ్యతిరేకించినా శరణ్య పెళ్లి చూపులకు వచ్చిన నాగరాజును ప్రేమించి గత ఫిబ్రవరిలో పెళ్లి చేసుకుంది. పెళ్లైన తర్వాత నాగరాజుకు శ్యామల ఫోన్ చేసి శరణ్య గురించి చెడుగా చెప్పింది. దీంతో నాగరాజు భార్యను వేధించడం మొదలుపెట్టాడు. ఈ నెల 23న శరణ్య పుట్టింటికి రాగా సోదరుడు సతీష్‌కుమార్, వదిన శ్యామల ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని గొడవ పెట్టడడంతో బాధితురాలు అదేరోజు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న అన్న, వదినలతో పాటు తండ్రి ధర్మయ్య శరణ్యను బుధవారం చితకబాదారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

అదనపు కట్నం కేసు నమోదు

బెల్లంపల్లి: అదనపు వరకట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడిన భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు బుధవానం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కన్నాల బస్తీకి చెందిన కుశ్నపల్లి హర్ష ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన కోమిడి ప్రవీణ్‌తో గత ఫిబ్రవరిలో పెళ్లి చేశారు. పెళ్లైన రెండోరోజు నుంచే భర్త ప్రవీణ్, అత్త తారాబాయి అదనపు వరకట్నం రూ.10లక్షలు తీసుకురావాలని వేధించడం ప్రారంభించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చెప్పారు.

ఉమ్మడి జిల్లాకు రూ.82.86కోట్లు

- ప్రత్యేక రుణ సాయానికి కేంద్రం ఆమోదం
- వైద్యం, రోడ్డు రవాణా మెరుగు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం అందించనున్న మూలధన పెట్టుబడుల వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రూ.82.86కోట్ల రుణాలకు ఆమోదం తెలిపింది. 2023–24ఆర్థిక సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు మూలధన వ్యయాన్ని అందించేందుకు 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్' పథకం ద్వారా 50ఏళ్ల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వనుంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం రూ.2,102 కోట్ల మూలధన పెట్టుబడుల ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదించింది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి వైద్యం, రహదారి ప్రాజెక్టులకు రుణం మంజూరు కావడంతో ఆ మేరకు అభివృద్ధి జరగనుంది. ఆమోదించిన ప్రాజెక్టుల్లో ఆసిఫాబాద్‌లోని జిల్లా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిలో వంద ఎంబీబీఎస్ సీట్ల కల్పన కోసం రూ.9.50కోట్లు, నిర్మల్ జిల్లా ఆసుపత్రి అప్‌గ్రేడ్ కోసం రూ.10కోట్లు, ఆదిలాబాద్ రిమ్స్ పరిధిలో కొత్తగా నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు రూ.20కోట్లు, మంచిర్యాల జిల్లా చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం 30నుంచి వంద పడకల అప్‌గ్రేడ్ కోసం రూ.10కోట్లు రుణ మంజూరుకు కేంద్రం ఆమోదించింది. నిర్మల్ పట్టణంలో జాతీయ రహదారి 61నుంచి సింగిల్ రోడ్డును నాలుగు వరసలుగా మార్చి, ఎల్లపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వరకు రోడ్డు విస్తరించి నిర్మించేందుకు రూ.27.57కోట్లు, ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి దాకా, వయా అంకోలి, వాన్వట్, పిప్పల్‌ధరి, కందాల, చిచ్‌ధరి, మీదుగా బుర్సన్‌పటార్ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.5.79కోట్లు రుణ మంజూరుకు కేంద్రం ఆమోదించింది. మొత్తంగా స్పెషల్ అసిస్టెన్స్ లోన్ కింద ఉమ్మడి జిల్లాకు ఆమోదించిన రూ.82.86కోట్ల ఈ మూలధన వ్యయంతో వైద్య, రోడ్డు రవాణా పరంగా అభివృద్ధి జరిగే అవకాశం ఉంది.

పరారీలోని దొంగను పట్టుకున్న పోలీసులు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఓ దొంగను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య వివరాల ప్రకారం... బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి ధనలక్ష్మి, తాళ్లపల్లి ప్రసాద్ భార్యభర్తలు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రిపూట ఇనుపరాడ్‌తో చాకచక్యంగా తాళం పగులగొట్టి దొంగతనాలకు పాల్పడటం వృత్తిగా పెట్టుకున్నాడు. ధనలక్ష్మి గత ఏప్రిల్ 29న బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి పక్కన ఉన్న క్వార్టర్స్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. ధనలక్ష్మిపై కేసు నమోదు చేసి రెండు నెలల క్రితం కోర్టుకు పంపించారు. ఆమె భర్త ప్రసాద్ పరారీలో ఉన్నాడు. మంగళవారం రాత్రి ప్రసాద్‌ను బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌వద్ద పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు.

భూ వివాదంలో ఇద్దరి దారుణ హత్య

- 13 మంది నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ నరేందర్, ఎస్సై భూమేశ్



అరెస్టు చూపిస్తున్న సీఐ నరేందర్, ఎస్సై భూమేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): భూవివాదంలో ఇద్దరిని హత్య చేసిన 13 మందిని పట్టుకున్నట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్ వెల్లడించాడు. వారి వివరాల ప్రకారం... గత సోమవారం జక్కులపెల్లి శివారులోని వ్యవసాయ భూమి విషయంలో మండల బక్కయ్య కుటుంబీలకు, మండల మెంగయ్య కుటుంబీలకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. గత ఆదివారం బక్కయ్య కుటుంబ సభ్యులు అదే భూమిలో పత్తి విత్తనాలు వేశారు. విషయం తెలుసుకున్న మెంగయ్యతో పాటు అతడి కుటుంబ సభ్యులు సోమవారం మధ్యాహ్నం కత్తులు, గొడ్డళ్లు, రాళ్లు, కారంపొడితో భూమి వద్దకు వెళ్లారు. వారి రాకకు గమనించి బక్కయ్య అడ్డుకునే ప్రయత్నం చేశాడు. వారు వెంట తెచ్చుకున్న కర్రలు, కత్తులు, గొడ్డళ్లతో దాడి చేయగా బక్కయ్య కుమారుడు మండల నర్సయ్యతో పాటు అతడి సోదరి గిరుగుల బక్కక్క అక్కడికక్కడే మృతి చెందారు. మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. మండల ఇందిరా ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నాలుగు బృందాలతో ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టి పరారీలోని 13మందిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి ఉపయోగించిన మూడు గొడ్డళ్లు, రెండు కత్తులు, నాలుగు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. మండల మల్లేష్, మండల గణేష్, మండల వెంకటేష్, గిరుగుల భీంరావు, గిరుగుల రాకేష్, మండల రంగక్క, గిరుగుల రజిత, మండల రజిత, మండల రుక్మ, రాటే భూమక్క, రాటే భూడయ్య, గిరుగుల దుర్గక్క, గిరుగుల సామ్యలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్ వీధిలో నివాసముంటున్న న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు ఇంట్లోని స్టోర్‌లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. సతీశ్‌బాబు దంపతులు నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు వెంటనే వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకొని తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు.